క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పితాని



ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పితాని బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సోమవారం నియామక ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలో ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్‌గా కొనసాగిన బాలకృష్ణ ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన విషయం తెలిసిందే. తనకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లకు బాలకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: మండలంలోని గోడితిప్ప సెంటర్లో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. మూడు రోజుల పాటు జరిగిన ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా కనకదుర్గ అమ్మవారి విగ్రహంతో పాటు శిఖర ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా కనకదుర్గ అమ్మవారిని ఎంపీ చింతా అనురాధ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఉత్సాహంగా ప్రచారం



కేశనకుర్రులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తనయుడు సుమంత్ తదితరులు

ఐ.పోలవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తనయుడు పొన్నాడ సత్య సుమంత్ కేశనకుర్రు గ్రామంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. సోమవారం కేశనకుర్రు పంచాయతీ పెద్ద ఊరు మర్రి చెట్టు నుంచి మసీదు సెంటరు వరకూ పర్యటించి ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేగా తన తండ్రి పొన్నాడను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు. తన తండ్రి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి రంగరాజు, పిన్నంరాజు బాబ్జిరాజు, కాశి పరివాజ్ కుమార్, చింతా రాంబాబు, వనచర్ల దత్తుడు, షేక్ సుభాన్, పెద్దిరెడ్డి బుజ్జి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 250 మంది చేరిక



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీలో వివిధ పార్టీలకు చెందిన 250 మంది పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కాలా వెంకటరమణ, కొప్పిశెట్టి వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నరాల శ్రీను, కడియాల కృష్ణ, కాలా సూర్యనారాయణ, పితాని సూర్యనారాయణ, దంగేటి అప్పారావు, రాయుడు కృష్ణ, శెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ అభ్యర్థిగా గౌతమ్

అమలాపురం టౌన్: అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న జంగా గౌతమ్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ గౌతమ్ ఇదే పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా, 2014 ఎన్నికల్లో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజితులయ్యారు.

సత్తా చాటిన సర్కారీ విద్యార్థులు

- పదో తరగతి ఫలితాల్లో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- ఫలించిన ప్రభుత్వ చర్యలు



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఈషితను అభినందిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్



పదో తరగతి విజేతలను అభినందిస్తున్న అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజరాజేశ్వరి


బద్రి ప్రశాంతి


రాయుడు గౌతమ్


ఉష ఐశ్వర్య


అమృత వర్షిని


కుడిపూడి కీర్తన


ఆర్.దీపక్


భ్రమర ఐశ్వర్యాంబిక


అక్కల బిందు శరణ్య


కోడూరి మౌనిక


కేశిరెడ్డి శ్రీవల్లి

అమలాపురం టౌన్/ముమ్మిడివరం/తాళ్లరేవు/ఐ.పోలవరం/ఉప్పలగుప్తం/అల్లవరం/యానాం: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించి సత్తా చాటారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిచ్చారు. రోజూ ఉదయం గంట, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్స్‌ను అందజేయడంతో పాటు మునుపటి పేపర్లు సాధన చేయించారు. మరోవైపు వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షల్లో ప్రతిఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా శిక్షణనిచ్చారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా పదో తరగతిలో సత్ఫలితాలు కనిపించాయి.

ఫలితాల్లో అదరగొట్టారు

- పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల పరంగా అమలాపురం పట్టణానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బద్రి ప్రశాంతి 600 మార్కులకు గాను 587 మార్కులు సాధించింది. దీంతో ప్రశాంతి ప్రథమ స్థానంలో నిలిచి పట్టణంలో టాపర్‌గా నిలిచింది. స్థానిక వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాయుడు గౌతమ్ 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. వారిద్దరినీ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డి.గౌరీశంకర్, బి.కామేశ్వరరావులు అభినందించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వైఎల్ఎస్ ప్రసన్నకు 600 మార్కులకు గాను 569 మార్కులు వచ్చాయి. అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని గుత్తుల పూర్ణ 600 మార్కులకు గాను 564 మార్కులు కైవసం చేసుకుంది. స్థానిక జవహర్‌లాల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.భువనేష్ వీఎస్ మణికంఠ 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించాడు.
- ముమ్మిడివరం మండలంలో పదో తరగతి పరీక్షల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 789 మందికి గాను 776 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ప్రభుత్వ పాఠశాలల్లో తానేల్లంక, గేదెల్లంక, గాడిలంక, సీహెచ్ గున్నేపల్లి, ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. తానేల్లంక పాఠశాలకు చెందిన కావిత భాను ప్రకాష్ 589 మార్కులతో ప్రథమ స్థానం, ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన కె.సుపర్ణి 584 మార్కులు, ముమ్మిడివర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కే.నిత్య కల్యాణి 584 మార్కులతో ద్వితీయ స్థానాలు, గేదెల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జి.కనక మహాలక్ష్మి 582 మార్కులతో తృతీయ స్థానాలు సాధించారు.
- తాళ్లరేవు మండలంలో పదో తరగతి విద్యార్థులు 84.82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారులు ఎ.మంగాయమ్మ, ఎం.ఉమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 1245 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 1052 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఇంజరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని బి.ఉష ఐశ్వర్య 583 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా 582 మార్కులతో చినబొడ్డు వెంకటాయపాలెం విద్యార్థిని అమృత వర్షిని ద్వితీయ స్థానాన్ని సాధించింది.
- పదోతరగతి పరీక్షల్లో ఐ.పోలవరం మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల స్థాయిలో పదో తరగతి పరీక్షలకు 701 మంది విద్యార్థులు హాజరుకాగా 683 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల స్థాయిలో 97.43 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి ఎస్.కొండలరావు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో కొమరగిరి జెడ్పీ పాఠశాలకు చెందిన కుడిపూడి కీర్తన(579), మురమళ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన వి.తేజస్విని(579) ప్రథమ స్థానాలు కైవసం చేసుకోగా, వడ్డి చెరువు జెడ్పీ పాఠశాలకు చెందిన నవరపు అర్చన(575) ద్వితీయ స్థానం, కొమరగిరి జెడ్పీ పాఠశాలకు చెందిన పసుపులేటి అనూష(572), మురమళ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన సాధనాల ప్రవల్లిక(572) తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అభినందించారు.
- ఉప్పలగుప్తం మండలంలో పదో తరగతి ఫలితాల్లో సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు 96.59 శాతం ఉతీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా 586 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వారిలో 566 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో-2 సత్తి సత్యకృష్ణ తెలిపారు. మండలంలో గొల్లవిల్లి పాఠశాలకు చెందిన అక్కల బిందు శరణ్య ప్రథమ స్థానం, ఎస్.కొత్తపల్లి పాఠశాలకు చెందిన కోడూరి మౌనిక ద్వితీయ స్థానం, కేశిరెడ్డి శ్రీవల్లి తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.
- అల్లవరం మండలంలో పదో తరగతి ఫలితాల్లో 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 13 ఉన్నత పాఠశాలలకు చెందిన 654 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 602 మంది విద్యార్థులు పాసయ్యారు. ఓడలరేవు ఉన్నత పాఠశాలకు చెందిన పినపోతు ఈషిత 595 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్, జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అల్లవరం ఉన్నత పాఠశాల విద్యార్థి కె.దివ్యతేజశ్రీ 571 మార్కులతో మండల స్థాయిలో రెండో స్థానం, కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌పీ లక్ష్మీదుర్గ 569 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. 595 మార్కులు సాధించిన పినపోతు ఈషితను జిల్లా పరిషత్ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ సీఈఓ రామ్‌గోపాల్, ఆర్డీఓ కేశవ వర్ధనరెడ్డి ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. ఈషితను ఎంపీడీఓ కృష్ణమోహన్ శాలువాతో సత్కరించి అభినందించారు.
- యానాం నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ హైస్కూళ్లలో 89.93 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని పిల్లా ఐశ్వర్యాంబిక 564 మార్కులు, డాక్టర్ కేఆర్‌నారాయణన్ ప్రభుత్వ స్కూల్ విద్యార్థి మెల్లం ప్రసాద్ 556 మార్కులు, గిరియాంపేట ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని సమ్మిడి దివ్య 537 మార్కులు, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థి ఎస్.యోగేష్ 525 మార్కులు సాధించారని తెలిపారు.
- అమలాపురం రూరల్ మండలంలో సమనస గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఆర్.దీపక్ 587 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన పి.వీరేంద్ర 582 మార్కులు, టి.అవినాష్ 579 మార్కులు, కె.దినేష్ రామ్‌కుమార్ 571 మార్కులు, డి.శివకుమార్ 571 మార్కులు సాధించారు.

మానవులంతా భూమిని కాపాడుకోవాలి



ధరిత్రి దినోత్సవం సందర్భంగా మొక్కలు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: మానవ జీవన మనుగడలో భాగమైన భూమిని అందరం కాపాడుకోవాలని వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అన్నారు. స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యాన వనం మున్సిపల్ పార్కులో సోమవారం సాయంత్రం జరిగిన ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో సత్య వరప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉద్యాన వనంలో మొక్కలు నాటారు. అనంతరం మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి వలవల వెంకట రెడ్డినాయుడు, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, మాజీ కౌన్సిల్ ఆశెట్టి ఆదిబాబు, వాకర్స్ ప్రతినిధులు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, తేతల సత్యనాయణరెడ్డి, రంకిరెడ్డి కాశీ తదితరులు పాల్గొన్నారు.

మూడు నామినేషన్ల దాఖలు



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పెమ్మాడి స్వామి

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నాలుగో రోజు సోమవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పెమ్మాడి స్వామి సింగిల్ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అమలాపురానికి చెందిన దొంగ సత్యారాం, కాట్రేనికోనకు చెందిన అంగాడి రేవతిలు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావుకు అందజేశారు. గత శనివారం నామినేషన్ వేసిన జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి సోమవారం మరో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

అట్టహాసంగా విశ్వరూప్ నామినేషన్

- వేలాదిగా తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- భట్నవిల్లి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ భారీ ర్యాలీ



ప్రచార రథం పైనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ నామినేషన్ ప్రక్రియ అట్టహాసంగా జరిగింది. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెండు జతల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డికి మంత్రి విశ్వరూప్, ఆయన సతీమణి బేబీ మీనాక్షి అందజేశారు. సోమవారం ఉదయం భట్నవిల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలో మంత్రి విశ్వరూప్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10.39 గంటలకు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం మంత్రి విశ్వరూప్ తన సతీమణి బేబీ మీనాక్షి, కుమారులు కృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, ఎమ్మెల్యే కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అధిక సంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. ప్రచార రథం పైనుంచి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. కామనగరువు, హౌసింగ్‌బోర్డు కాలనీ, నల్లవంతెన రోడ్డు, కాటన్‌పార్కు మీదుగా ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంది. తీన్‌మార్, డీజే బ్యాండ్‌లతో కలిసి ఆయన అభిమానులు మోటార్ సైకిల్ ర్యాలీ చేశారు. సీఎం జగన్, విశ్వరూప్ జెండాలతో కార్యకార్తలు ఊరేగింపు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి కార్యకర్తలు తరలి రావడంతో భట్నవిల్లి, ఎర్రవంతెన సమీప ప్రాంతమంతా జనంతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. కళ్లముందు కనిపిస్తున్న ప్రజాదరణే దానికి సంకేతమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఏంఎపీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల పరిషత్ అధ్యక్షులు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరరావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెడ్డం సంపదరావు, కొనుకు గౌతమి, అమలాపురం పట్టణ, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జి, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాస్, కామిశెట్టి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ఏపీ అగ్రి మిషన్ మెంబర్ జిన్నూరి బాబి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న మంత్రి విశ్వరూప్

ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కడతారు



అయినాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



అయినాపురంలో ఎమ్మెల్యే పొన్నాడకు ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- అయినాపురంలో అడుగడుగునా బ్రహ్మరథం

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను కొనసాగిస్తూ ప్రజలు వైఎస్సార్ సీపీకి మళ్లీ పట్టం కడతారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ప్రత్యర్థులకు అందనంత వేగంగా ప్రచారం దూసుకుపోతున్న ఎమ్మెల్యే పొన్నాడ సోమవారం తన స్వగ్రామమైన అయినాపురంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. గడప గడపకూ వెళ్లి ఆయనకు ఇంటింటా పూలు జల్లుతూ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయలకు అతీతంగా ఇంటింటికీ లబ్ధి చేకూర్చారన్నారు. మహిళలు, రైతులు, చేతి వృత్తిదారులు, చిరు వ్యాపారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తనను ఎమ్మెల్యేగా, రాపాక వరప్రసాదరావును ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, గ్రామ కమిటీ కన్వీనర్ ఇందుకూరి సుబ్బరాజు, మోకా రామారావు, మట్టపర్తి సురేష్, రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, నడింపల్లి సూరిబాబు, జగతా పత్మనాభం, నల్లా నరసింహరావు, కోలా బాబ్జీ, కాశి బాలమునికుమారి, పెయ్యల భూలక్ష్మి, దువ్వూరి శ్రీనివాస్, ఇసుకపట్ల శివ, కాట్రు అప్పారావు, బొర్రా విష్ణు, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించండి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ తల్లి రామానుజమ్మ, సతీమణి నీరజ

కాట్రేనికోన: రానున్న ఎన్నికల్లో ప్రజలకు మంచి చేసిన వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచి ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే పొన్నాడ తల్లి రామానుజమ్మ, సతీమణి నీరజ అన్నారు. మండలంలోని పల్లం గ్రామంలో సోమవారం వారిద్దరూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు వారిద్దరికీ హారతులు ఇస్తూ బ్రహ్మరథం పట్టారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ తల్లి రామానుజమ్మ మాట్లాడుతూ తన కుమారుడు పొన్నాడ పల్లం గ్రామానికి సుమారు రూ.5 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు కట్టించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారన్నారు. మంచి నీటి కోసం పల్లం గ్రామం పడిన కష్టాలు తనకు తెలుసనని, తన బిడ్డతో చెప్పి సమస్యను పరిష్కరించానన్నారు. రానున్న ఎన్నికల్లో తన కుమారుడికి అండగా నిలిచి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలెపు లక్ష్మీ ధర్మారావు, సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, ఎంపీటీసీ సభ్యురాలు కోలాటి సత్యవతి, కోలా మీరయ్య, కోలాటి సత్యం, కాటం శ్రీను, వినాయకుడు తదితరులు పాల్గొన్నారు.



పల్లం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి నీరజ, తల్లి రామానుజమ్మ

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ 8వ వార్డుకు చెందిన 75 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం ముమ్మిడివరంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణ ఆధ్వర్యంలో 8వ వార్డు సూరాయి చెరువుకు చెందిన దొంగ బాలకృష్ణ, గొవ్వాల ఏడుకొండలు, బొంతు సూరిబాబు, కుడిపూడి శ్రీను, దొంగ శ్రీనుతో పాటు 75 మంది పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత పెంచేలా ప్రేరణా ఉత్సవ్

యానాం: విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రేరణా ఉత్సవ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ సోమవారం తెలిపారు. స్థానిక నవోదయ స్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారిని ప్రధాని మోదీ చదివిన స్కూల్‌లో 9 అంశాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం, కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేగం, చిన్నాదేవి, శంకరం పాల్గొన్నారు.